సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం : 13 : జూలై : 2024



అట్టహాసంగా..

కల్వకుర్తిలో రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



వైభవంగా చండీహోమం

నాగర్‌కర్నూల్‌లో కొనసాగుతున్న యాగ మహోత్సవంలో చండీహోమం నిర్వహించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.4 /23.7

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పీయూ సెమిస్టర్ ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ సెమిస్టర్–6కు సంబంధించి రెగ్యులర్, సెమిస్టర్ 5కు సంబంధించి బ్యాక్ లాగ్ ఫలితాలను పీయూ వీసీ మహ్మద్ నదీమ్, రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఈ మేరకు సెమిస్టర్–6లో మొత్తం 13,757 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే 60.55శాతం ఉత్తీర్ణతతో 8,330 మంది పాసయ్యారు. కాగా 5,410 మంది ఫెయిల్ కాగా.. మాల్ ప్రాక్టీస్‌లో 17 మంది పట్టుబడ్డారు. ఇక సెమిస్టర్ 5లో మొత్తం 2,217 మంది పరీక్షలకు హాజరై 1,220 మంది పాసై, 55.44శాతం ఉత్తీర్ణతనమోదు చేశారు. రీ వ్యాలువేషన్‌కు ఈనెల 24లోగా దరఖాస్తులు చేసుకోవాలని పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నాగభూషణం, చంద్రకిరణ్, శాంతిప్రియ, విజయలక్ష్మి, అరుంధతిరెడ్డి పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో ‘డ్రై’ డే



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డులలో శుక్రవారం ‘డ్రై’ డే విస్తృతంగా నిర్వహించారు. వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఇంటింటికీ మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్పీలు, ఆశా కార్యకర్తలు తిరిగారు. నల్లా గుంతల్లో ఫినాయిల్ చల్లారు. ఎక్కడా రోజుల తరబడి నీటినిల్వ చేయొద్దని పట్టణ ప్రజలకు సూచించారు. ఇక వీధులలోని మోరీలు, పెద్ద నాలాలను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. కాగా, రాజేంద్రనగర్ (వార్డు నం.39) లో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఓ ఇంటి ఆవరణలో పదికి పైగా ఉన్న పాత టైర్లను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్తా చెదారం వేయొద్దన్నారు. ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకు వేరుచేసిన తడి, పొడి చెత్తను అందజేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వజ్రకుమార్‌రెడ్డి, గురులింగం, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీనియర్ సిటిజన్ ఫోరం సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో శనివారం మహిళా సీనియర్ సిటిజన్ ఫోరం సమావేశం నిర్వహించనున్నట్లు కన్వీనర్ అవిటి నాగశ్రీ, కోకన్వీనర్ శశికళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబం, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక సేవా కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మహిళా సీనియర్ సిటిజన్స్ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డిగ్రీ కళాశాల కోసం స్థల పరిశీలన

దేవరకద్ర: నియోజవర్గ కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం శుక్రవారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు స్థల పరిశీలన చేశారు. కోయిల్‌సాగర్ రహదారిపై బలుసుపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కళాశాల భవన నిర్మాణం కోసం అనువుగా ఉన్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించిన భూమి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం దేవరకద్ర సమీపంలోని 167వ జాతీయ రహదారి పక్కన ఉన్న మెగా ప్రకృతి వనం వద్ద ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. ఇక్కడ ఆస్పత్రి నిర్మాణం కోసం గతంలోనే ప్రతిపాదనలు చేశారు. త్వరలో పనులు ప్రారంభించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు, తదితరులున్నారు.



ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ రూ.2,375

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ఆర్‌ఎన్‌ఆర్ గరిష్టంగా క్వింటాల్‌కు రూ.2,375, కనిష్టంగా రూ.2,069 ధరలు లభించాయి. అదేవిధంగా ధాన్యం హంస రూ.1,453 ధరపలికింది.





సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లాలోని రైతులు; మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావును కలెక్టరేట్ వద్దకు ఎడ్లబండిపై తీసుకొస్తున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

ప్రజాభిప్రాయానికే ప్రాధాన్యం

‘రైతు భరోసా’పై ఇంకా తుది నిర్ణయం కాలేదు

- గుట్టలు, రాళ్లు, బంగ్లాలు, ఫాంహౌస్‌లకు పెట్టుబడిసాయం ఇవ్వం
- రైతుల అభిప్రాయ సేకరణ కోసమే ప్రత్యేక వర్క్‌షాపు
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- హాజరైన మంత్రులు పొంగులేటి, జూపల్లి, ఐదు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, వ్యవసాయ అధికారులు



తుమ్మల నాగేశ్వర్‌రావు

వనపర్తి/ ఖిల్లా ఘణపురం: ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యమిస్తూ.. ప్రజాధనాన్ని సక్రమంగా ఉపయోగించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం రైతు భరోసా పథకం వర్తింపుపై సమగ్ర అధ్యయనం చేసేందుకు కేబినెట్ సబ్ కమిటీతో క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయాలు సేకరిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. శుక్రవారం రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కోసం వనపర్తి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లాకు సంబంధించిన వర్క్‌షాప్ కార్యక్రమానికి కేబినెట్ సబ్ కమిటీ హాజరైంది. అనివార్య కారణాలతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ హాజరుకాలేదు. జాబితాలో ఉన్న మంత్రులు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, పలువురు ఎమ్మెల్యేలతో కార్యక్రమాన్ని కొనసాగించారు. రైతులు అంచనాకు మించి రావడంతో హాల్‌లో కొందరు నిలబడే కార్యక్రమం పూర్తయ్యే వరకు పాల్గొన్నారు. హెలీకాప్టర్‌లో జిల్లాకు చేరుకున్న మంత్రులు ఎస్పీ కార్యాలయ ఆవరణలో హెలీప్యాడ్ నుంచి ఎద్దుల బండిపై స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సారథ్యంలో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ఏటా ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయంపై రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతల అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. వీరి ఆలోచనల మేరకు అసెంబ్లీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వ్యవసాయ రంగాన్ని, చిన్న, సన్నకారు రైతులను కాపాడుకునేందుకు కృత నిశ్చయంతో పనిచేస్తుందన్నారు. ఆయా వర్గాల ప్రజలు, రైతులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ కష్టార్జితం నుంచి చెల్లించిన పన్ను, వివిధ రకాలుగా ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని వృథా చేయకుండా సక్రమంగా వినియోగించాలని ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే రైతులకు బీమా వర్తింపజేసేందుకు సీఎం సుముఖంగా ఉన్నారని, రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయంపై చర్చిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో శాట్ చైర్మన్ కె.శివసేనారెడ్డి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, వాకిటి శ్రీహరి, జి.మధుసూదన్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్‌రావు, ఐదు జిల్లాల కలెక్టర్లు, ఆయా జిల్లాల డీఏఓలు తదితరులు పాల్గొన్నారు.

వాటికి ఇచ్చేది లేదు..: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



గత ప్రభుత్వం చేసిన పొరపాట్లను మరోసారి చేయొద్దనే ఆలోచనతో ముందుకు సాగుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఫాంహౌస్‌లు, గుట్టలు, ప్రభుత్వ అసైన్డ్ భూములకు ఈసారి పెట్టుబడి సాయం ఇవ్వొద్దని, పంటలు సాగు చేసుకునే నిజమైన రైతులకే ఇవ్వాలనే దృఢ నిశ్చయంతో, అత్యధిక మంది రైతుల అభీష్టం మేరకు ఈ పథకం అమలు చేసేందుకు నిబంధనలు రూపొందిస్తున్నామన్నారు. వందల ఎకరాల భూస్వాములు, కోటీశ్వరులకు పెట్టుబడి సాయం ఇవ్వక్కర్లేదని రైతులు సైతం ముక్తకంఠంతో అభిప్రాయాలు వెల్లడిస్తున్నట్లు చెప్పారు.



■ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంపై అప్పుల భారం ఎక్కువైనా అన్నదాతలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా ఎకరాకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించేందుకు సిద్ధమైందన్నారు. అయితే అర్హులైన రైతులు, వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారికి మాత్రమే సాయం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతుల అభిప్రాయాలు సేకరిస్తోందని పేర్కొన్నారు.



■ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో పదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులు 90 శాతం పైబడి ఉన్నారని, వారికి పెట్టుబడి సాయం అందించడం ముఖ్యం అన్నారు. బీడు భూములు, సంపన్న కుటుంబాలకు ప్రజాధనం రైతు భరోసా కల్పించాల్సిన అవసరం లేదన్నారు.



■ నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారికి రైతు భరోసా ఇవ్వొద్దని ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే అపోహలు కల్పిస్తున్నారని, వాటిని రైతులు నమ్మొద్దు అని కోరారు. ఇప్పటి వరకు రైతు భరోసాపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజున చెప్పిన ప్రకారమే ప్రజాపాలన కొనసాగుతుందన్నారు.

■ ఎక్కువ మంది రైతుల అభిప్రాయం పదెకరాల్లోపు ఉన్నవారికి, పంటలు సాగు చేసే వారికి మాత్రమే రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. ఒక కుటుంబానికి పది ఎకరాల్లోపు వర్తింపజేయాలని మరికొందరు రైతులు అభిప్రాయపడ్డారు. అయితే కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన రైతుల్లో రాజకీయాల్లో కీలకంగా ఉంటూ.. వ్యవసాయం చేసుకునే వారు, ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేసే వారు ఉండటం గమనార్హం.



హాజరైన కలెక్టర్లు విజయేందిర, సంచిత్ గంగ్వార్, సిక్తా పట్నాయక్, బి.సంతోష్, బీఎం సంతోష్

కౌలు రైతులకు ఇవ్వాలి



నాకు ఎకరా భూమి ఉంటే కాల్వలకు పోయింది. చేసేది లేక మా ఊళ్లో కొంతమంది దగ్గర భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. నాకు ఇప్పటి వరకు రైతుబంధు డబ్బులు రాలేదు. ఏ నాయకుడు గాని, అధికారులు గాని నా బాధను పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ సర్కారు ఇచ్చే రైతు భరోసా డబ్బులైనా నాలాంటి కౌలు రైతులకు వచ్చేలా చూడాలి.
– సీతారాములు, కౌలురైతు, గట్టు, గద్వాల జిల్లా

కుటుంబానికి 10ఎకరాల వరకే..



ఒక కుటుంబంలో ఎంత మంది రైతులు ఉన్నా.. 10 ఎకరాల వరకు రైతు భరోసా అందించాలి. అలా కాకుండా 50, 100 ఎకరాల రైతులకు ఈ పథకం ద్వారా నగదు అందించడం వలన ఎలాంటి ఉపయోగం ఉండదు. ప్రభుత్వం ఆలోచించి సరైన నిర్ణయం తీసుకొని నిజమైన నిరుపేద రైతులకు మేలు చేయాలి. – ఆంజనేయులు, రైతు, పెద్దమందడి, వనపర్తి జిల్లా

సాగు చేసిన పంటలు ఆధారంగా



ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా నగదును పంటలు సాగు చేసిన భూమికే ఇవ్వాలి. రైతులు ఎన్ని ఎకరాలు సాగు చేశారో గుర్తించి సాగు చేసిన భూమి ఎంత ఉన్న 10ఎకరాలకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి. అలా ఇచ్చినప్పుడే నిజమైన రైతులకు న్యాయం జరుగుతుంది. – ఇందిర, మహిళా రైతు, చిన్నంబావి, వనపర్తి జిల్లా

గ్రామకంఠం భూములకు వద్దు..



గ్రామాలు, పట్టణ పరిసరాల్లో ఉన్న వెంచర్లు, గ్రామకంఠంలోని భూములకు రైతుబంధు డబ్బులు వచ్చాయి. ప్రభుత్వం అధికారులతో సర్వే చేయించాలి. అలాంటి భూములకు పూర్తిస్థాయిలో రైతుభరోసా రాకుండా చూడాలి. రికార్డులు రెవెన్యూ శాఖలో ఉన్నప్పటికి ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు.
– బాలరాజు, రైతు, నాగర్‌కర్నూల్

రైతుకు లాభదాయకం..



రైతు పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వడంతోపాటుగా అదనంగా బోనస్ ఇవ్వాలి. అలా ఇచ్చినప్పుడే భూమి యజమానితోపాటు కష్టపడి పంట పండించిన కౌలు రైతుకు లాభదాయకంగా ఉంటుంది. కౌలు రైతులకు నేరుగా సహాయం చేసినవారవుతారు. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. – నాగిరెడ్డి, రైతు, మహబూబ్‌నగర్

వనమహోత్సవం లక్ష్యం పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, పక్కన వివిధ శాఖల జిల్లా అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వన మహోత్సవంలో భాగంగా గ్రామ, మండలాల వారీగా వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వన మహోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, ప్రజాపాలన కేంద్రాలు, మహిళాశక్తి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 55 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమంలో వేగం పెంచాలని ఆదేశించారు. అలాగే ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి శుక్రవారం విధిగా డ్రైడే నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలని ఆదేశించారు. ఆగస్టు 31 వరకు చేపట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో శుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. మహిళాశక్తి కార్యక్రమం ద్వారా మండలాల వారీగా కేటాయించిన టార్గెట్ మేరకు లబ్ధిదారులను గుర్తించాలని తెలిపారు. అనంతరం మహిళాశక్తి యూనిట్లకు బ్యాంకు రుణం మంజూరు, గ్రౌండింగ్‌పై సమీక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రజాపాలన కేంద్రాలు ఉండాలన్నారు.

ప్రజాపాలనకు 2.60 దరఖాస్తులు

గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు వచ్చే దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 2.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని.. 40 వేల దరఖాస్తులకు సంబంధించి కొన్ని డాక్యుమెంట్లు సరిగా లేకపోవడంతో లబ్ధిదారులు గృహజ్యోతి జీరో బిల్లు, మహాలక్ష్మి కింద సిలిండర్ సబ్సిడీ అందడం లేదన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా సవరణలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో 40 వేలకు గాను 24 వేలమంది ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా సవరణలు చేసుకున్నారని, మిగతా దరఖాస్తుదారులు సవరణలు చేసుకునేలా ఎంపీడీఓలు విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జెడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు, డీఎంహెచ్ఓ కృష్ణ, జిల్లా మలేరియా నివారణ అధికారి భాస్కర్ నాయక్, డీఆర్డీఓ నర్సింహులు, డీఈఓ రవీందర్, డీఎఫ్ఓ సత్యనారాయణ ఉన్నారు.

గంజాయి విక్రయాలపై నిఘా: ఎస్పీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో గంజాయి నుంచి యువతను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రధానంగా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ డి.జానకి అన్నారు. జిల్లాకేంద్రంలోని సుదర్శన్ గార్డెన్‌లో శుక్రవారం అన్ని రకాల కళాశాల యాజమాన్యాలతో పాటు పోలీస్ అధికారులకు మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వల్ల యువత భవిష్యత్ ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. యువత జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని, ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాలను విక్రయించిన పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. మత్తు పదార్థాలు వినియోగించే వారి సమాచారం సైతం ప్రత్యేకంగా సేకరించాలని, నిత్యం వారిపై దృష్టి సారించాలన్నారు. భవిష్యత్‌లో గంజాయి రహిత జిల్లాగా మహబూబ్‌నగర్‌ను తీర్చిదిద్దాలన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సమాచారాన్నిపోలీస్ కంట్రోల్ రూం.8712659360కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ్ భాస్కర్‌రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి పాల్గొన్నారు.

15న మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 15న పాలమూరు యూనివర్సిటీ ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం రీసెర్చ్ మెథడాలజీ, ప్రాజెక్టు గైడెన్స్‌పై అవగాహన నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య ఆవిష్కరించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి నిపుణులైన ప్రొఫెసర్లు వస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఓడీ నాగసుధ, అర్జున్‌కుమార్, రవికుమార్, రాజశేఖర్, జావెద్ తదితరులు పాల్గొన్నారు.


ఉపకార వేతనాలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వాలు మారిన విద్యార్థులకు ఉపకార వేతనాలు రావడం లేదని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా ప్రభుత్వం ఉపకార వేతనాలు ఇవ్వడం లేదని, వీటి కోసం 14 లక్షల మంది ఎదురు చూస్తున్నారని వాపోయారు. ప్రతి ఏడాది విద్యార్థులకు రూ.3 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లను ఇవ్వకుండా.. విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేసినప్పుడు ఆర్థికశాఖ అధికారులు నిధులు లేకుండానే టోకెన్‌లు జారీచేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ప్రైవేటు కళాశాలల్లో ఉపకార వేతనాలు ఇవ్వనందుకు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చే సమయంలో ఇబ్బందులు గురి చేస్తున్నారని, దీంతో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఫీజుల ఇవ్వకపోవడం వల్ల కళాశాలలు సైతం మూతబడే పరిస్థితిలో ఉన్నాయన్నా రు. జిల్లా కార్యదర్శి ప్రశాంత్, అధ్యక్షుడు భరత్, నందు, శ్రీనాథ్, రాధిక, ఈశ్వర్, కార్తీక్, మధు పాల్గొన్నారు.

పోలేపల్లి ఫార్మాసెజ్‌ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం



ఫార్మాసెజ్ సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి ఫార్మాసెజ్‌ను 2023కు చెందిన ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌ల బృందం సందర్శించారు. ఐదు రోజుల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఈనెల 8 నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు పర్యటించారు. పర్యటన చివరిరోజు శుక్రవారం డా.ఎంసీఆర్ హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఫీల్డ్‌విజిట్ నోడల్ అధికారి డా. శ్రీనివాస్, జనరల్ మేనేజర్ బాబురావ్‌ల ఆధ్వర్యంలో సెజ్‌కు చేరుకున్నారు. స్థానిక ఎంపీడీఓ వెంకట్‌ప్రసాద్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ హన్మంతులు స్వాగతం పలికారు. సెజ్‌లో ఉన్న పరిశ్రమల గురించి మ్యాప్‌సహాయంతో బృందానికి వివరించారు. అనంతరం వారు హెటిరో ఫార్మాను పరిశీలించారు. అక్కడ పరిశ్రమ ఏర్పాటు, మందుల తయారీ, వాటి ఎగుమతులు, ఉద్యోగుల వివరాలను తెలుసుకున్నారు. ఫార్మాసెజ్‌ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లలో ఉమాహారతి (వికారాబాద్), అజ్మీర సంకేత్‌కుమార్ (నిజామాబాద్), గరిమనారుల్ల (నారాయణపేట), అభిగ్యాన్ మాళవియ (ఆదిలాబాద్), అజయ్ యాదవ్ (కరీంనగర్), మృనాల్ శ్రేష్ఠత్ (ఖమ్మం), డి.మనోజ్ (సంగారెడ్డి)లు ఉన్నారు.

క్లుప్తంగా

కొద్ది రోజుల్లో పెళ్లి.. కాబోయే వధువు మృతి



రూబిక (ఫైల్)

రాజోళి: కొన్ని రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువతి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన రాజోళి మండలం మాన్‌దొడ్డిలో తీవ్ర విషాదం రేపింది. స్థానికుల వివరాల మేరకు.. మాన్‌దొడ్డికి చెందిన తిరుపాల్, ఆశీర్వాదమ్మల కూతురు రూబిక (22) కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, వైద్యుల సలహా మేరకు చికిత్స పొందుతుంది. ఆమెకు ఇటీవల వివాహం నిశ్చయమైంది. త్వరలోనే వివాహం జరగాల్సి ఉంది. ఈక్రమంలో వారం రోజులుగా యువతికి జ్వరం, కిడ్నీ వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. యువతి మృతితో గ్రా మంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

గద్వాల క్రైం: కుటుంబ కలహాల వల్ల మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం గద్వాల పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చింతలపేట కాలనీకి చెందిన పద్మ (36) భర్త నర్సింహులుతో కలిసి మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని రోజులుగా ఆర్థిక పరమైన విషయాలపై భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చాయి. గురువారం రాత్రి ఇదే విషయంపై మనస్పార్థాలు చోటు చేసుకున్నాయి. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన పద్మ శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనపై బంధువులు ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆరు నెలల జైలుశిక్ష

గద్వాల క్రైం: నిర్లక్ష్యంగా ట్రాక్టర్ డ్రైవ్ చేస్తూ ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధిస్తూ గద్వాల ప్రథమశ్రేణి న్యాయమూర్తి వెంకట హైమ పూజిత తీర్పు ఇచ్చినట్లు కోర్టు ఏపీపీ భవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్దకల్ మండలం తాటికుంట గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్(17) స్నేహితులతో కలిసి 10-05-2019న బైక్‌పై వెళ్తున్నాడు. రాజోళి మండలం మాన్‌దొడ్డికి చెందిన డ్రైవర్ బోయ వెంకటేష్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను తాటికుంట స్టేజీ సమీపంలో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఉదయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి స్వామిదాసు ఫిర్యాదు మేరకు మల్దకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం కోర్టు విచారణ, సాక్షుల వాగ్మూలం అనంతరం న్యాయమూర్తి నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ట్రాక్టర్ యజమాని రామకృష్ణారెడ్డికి రూ.1500 జరిమానా విధించిందన్నారు.

18న అప్రెంటీస్ మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఇంటర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఈనెల 18న అప్రెంటీస్ మేళాను నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ శ్రీధర్ సుమన్ పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు సంబంధించిన వివిధ కోర్సుల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 70138 38794 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

- నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్ ప్రారంభం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు ఎలాంటి ఇన్‌ఫ్లో లేదని పేర్కొన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో నీటి పంపింగ్ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. నెట్టెంపాడుకు 359 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 131 క్యూసెక్కులు, ఇతర అవసరాలకు 336 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి ఇతర అవసరాలకు 856 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రాజెక్టులో 7.608 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం నిలకడగ కొనసాగుతోంది. జూరాల సమాంతర కాల్వ, ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. శుక్రవారం పూర్తి నీటి మట్టం 1,020 అడుగులకు చేరింది. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

అట్టహాసంగా..



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు

- రాష్ట్రస్థాయి బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం
- పోటీలకు తరలివచ్చిన ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు
- మొదటి మ్యాచ్‌లో బోణీ కొట్టిన మహబూబ్‌నగర్
- మూడు రోజులపాటు కొనసాగనున్న పోటీలు

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి పట్టణంలోని స్టేడియంలో శుక్రవారం తెలంగాణ 10వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది. పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి క్రీడా జెండా ఆవిష్కరించగా.. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం క్రీడాకారులచే ప్రతిజ్ఞ చేయించారు. క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకున్న అనంతరం వారితో కలిసి కొంతసేపు ఫుట్‌బాల్ ఆడి ఉత్తేజపరిచారు. ఫుట్‌బాల్ టోర్నీ మూడు రోజులపాటు కొనసాగనుంది.

స్టేడియాల అభివృద్ధికి కృషి..

స్టేడియాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఫాల్గుణ అన్నారు. చాలా చోట్ల స్టేడియాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక స్టేడియాలలో వసతులు, క్రీడాకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్రీడలపై ఎంతో మక్కువ ఉందని.. అందుకు తగ్గట్టుగా క్రీడలకు ప్రోత్సాహం అందిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. కోచ్‌ల పర్యవేక్షణలో క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తే ఉత్తమ విజయాలు అందుకుంటారని చెప్పారు. కాగా, క్రీడల నిర్వహణ కోసం రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ తరఫున ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భానుకిరణ్‌కు ఫాల్గుణ రూ. 50 వేలు అందజేశారు.

క్రీడలకు పెద్దపీట..



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే, క్రీడా కోటాలో ఉన్నత చదువులతో పాటు, ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. కల్వకుర్తి ప్రాంతంలో క్రీడల నిర్వహణకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. క్రీడాకారుడైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నందున క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు.

మహబూబ్‌నగర్ బోణి..

ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం మొదటి రోజు మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగాయి. మొదటి మ్యాచ్‌లో నిజామాబాద్ - రంగారెడ్డి జట్లు తలపడగా.. నిజామాబాద్ 6-0 గోల్స్ తేడాతో గెలిచింది. రెండో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ - కరీంనగర్ జట్టు తలపడగా.. మహబూబ్‌నగర్ జట్టు 9-0 గోల్స్‌తో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు క్రీడాకారులు అక్షర 4, ఆనందవళి 4, అనూష 1 గోల్స్ సాధించి జట్టు విజయానికి కృషిచేశారు. అదేవిధంగా ఖమ్మం - నల్లగొండ జట్లు తలపడగా.. నల్లగొండ 2-0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. అనంతరం మెదక్ - మంచిర్యాల జట్లు తలపడగా.. మంచిర్యాల జట్టు 1-0 గోల్స్‌తో గెలిచింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, డీవైఎస్‌ఓ సీతారాం, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తలపడుతున్న మహబూబ్‌నగర్, కరీంనగర్ క్రీడాకారులు

పాలమూరులో మరో బ్రాండ్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న శివసేనారెడ్డి

పాలమూరు: జిల్లాకేంద్రంలో మరో బ్రాండ్ వస్త్ర దుకాణం ప్రారంభంమైంది. లూయిస్ ఫిలిప్ (ఇటలీ బ్రాండ్ అండర్ ఆదిత్య గ్రూప్) నూతన బ్రాంచ్‌ను శుక్రవారం శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, బ్యాంకు ఆఫ్ ఇండియా ఏజీఎం శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్రాంచైజీ డీలర్ వేణుగోపాల్ సింగ్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన లూయిస్ ఫిలిప్ షోరూంలో అంతర్జాతీయ బ్రాండ్స్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సూటింగ్, షర్టింగ్, క్యాజువల్స్, బ్లేజర్లు, జీన్స్‌లు, టీషర్ట్స్, పర్సులు, బెల్టులు అన్ని రకాలైన మెన్స్‌వేర్ అతి తక్కువ ధరలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మహబూబ్‌నగర్ ప్రజల జీవన శైలికి, ప్రీమియం దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలోఏబీఎం దర్నేష్, మురళీ కృష్ణ, అల్లాబిక్ష పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత



బల్గెర చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన బొలేరో వాహనం

గట్టు/మక్తల్/ఉప్పునుంతల: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గట్టు మండలం బల్గెర సమీపంలోని తెలంగాణ - కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ మల్లేష్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో అయిజ నుంచి రాయచూర్‌కు మూడు బొలేరో వాహనాల్లో సుమారు 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాలను సీజ్ చేయడంతో పాటు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

➪ మక్తల్ పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టగా.. 30 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. మక్తల్‌కు చెందిన ఎరుకలి రమేష్ అనే వ్యక్తి ఊట్కూర్, మరికల్ తదితర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి, టాటా ఏస్ వాహనంలో కర్ణాటకకు తరలిస్తుండగా.. పట్టుకొని సీజ్ చేసినట్లు వెల్లడించారు. రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

➪ ఉప్పునుంతల మండల కేంద్రంలో రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ సుజ్ఞానం తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్ ఫిర్యాదు మేరకు ఉప్పునుంతలకు చెందిన పాపిశెట్టి కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న ఆర్డీఓ మాధవి, తహసీల్దార్ సరిత

మన్ననూర్: గ్రామంలోని రైతువేదిక సమీపంలో పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను అమ్రాబాద్ తహసీల్దార్ సరితతో కలిసి అచ్చంపేట ఆర్డీఓ మాధవి శుక్రవారం కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండ అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనిపై గతంలోనే నిర్మాణాలు చేయవద్దని బాధితులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేశామన్నారు. ఇక్కడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మించేందుకు నిధులు సైతం మంజూరయ్యాయని, త్వరలోనే పనులకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. అలాగే శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి అంబేద్కర్ కూడలిలో 20 ఏళ్ల క్రితం బస్టాండ్ నిర్మించేందుకు గాను అక్కడే నివాసం ఉంటున్న మంతటి దేవేందర్, మంతటి పురుషోత్తంలకు సంబంధించిన ఇళ్లను తొలగించి బస్టాండ్, ఆంజనేయులుకు సంబంధించిన ఇంటిని కూలివేసి మదర్సా నిర్మించారని, వీరికి త్వరలోనే ప్రత్యామ్నాయంగా మన్ననూర్, అచ్చంపేట పరిసరాల్లో ఎక్కడో ఒక చోట స్థలం ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీరస్వామి, అమ్రాబాద్ పోలీసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇహపర సాధనకు చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న దంపతులు



కుంకుమార్చనలు నిర్వహిస్తున్న భక్తులు

- 225 మంది దంపతులతో కార్యక్రమం
- 400 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చనలు
- 22 మంది దంపతులతో పుత్ర కామేష్టి యాగం

నాగర్‌కర్నూల్: ఇహపర సాధనకు చండీ హోమం ఉత్తమమైందని శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ అన్నారు. హోమం ఎలా చేసుకుంటే సంపూర్ణ ఫలితం ఉంటుందనే విషయాన్ని భక్తులకు తెలియజేసి, వారితో చండీ హోమాలని ఆచరింపజేశారు. సామూహిక హోమాల్లో భాగంగా 225 మంది దంపతులు చండీ హోమంలో పాల్గొన్నారు. మార్కండేయ పురాణంలో చండీ హోమం విశిష్టతను తెలిపారని, 13 అధ్యాయాలు, 700 శ్లోకాలతో చండీ హోమం నిర్వహిస్తారన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో ఈ నెల 7 నుంచి 21వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్రం అయుత చండీ, అతి రుద్రం, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 83వ విశ్వశాంతి మహా యాగ మహోత్సవంలో భాగంగా నిరంతరం కొనసాగుతున్నటువంటి యాగశాల కార్యక్రమాలను బ్రాహ్మణులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆరో రోజు శుక్రవారం గోపూజ, యాగశాల ప్రదక్షిణ మొదలు అత్యంత వైభవంగా వేద హోమాలు, చండీహోమాలు, రుద్రహోమాలు, రామాయణం భాగవత సుందరకాండ చతుర్వేద హోమాలు సామవేద, యజుర్వేద, అథర్వణవేద, ఋగ్వేద, ఋత్విక్కులు వేద మూర్తులైన బ్రాహ్మణులతో వేద మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. సామూహిక హోమాల్లో భాగంగా సంతాన ప్రాప్తికి పుత్ర కామేష్టి హోమాలు 22 మంది దంపతులతో నిర్వహించారు. సాయంత్రం చండీ అమ్మవారిని పంచామృతాలతో అభిషేకం చేశారు. శ్రీచక్రానికి పంచామృత అభిషేకం, అర్చన చేసి, భక్తుల కలహాలు, బాధలు పోయి ధన, కనక, వస్తు వాహనాలతో పుష్టిగా ఉండాలని సంకల్పం చేసి అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో 400 మంది పైగా సౌభాగ్యవతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో 8,000 మందికి అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం సుదర్శన, పాశుపత, నవగ్రహ, లక్ష్మీనారాయణ హోమాలు, పుత్ర కామేష్టి హోమాలు, సాయంత్రం 6 గంటలకు భూనీళా సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని బ్రాహ్మణులచే శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ తెలియజేశారు.

స్వచ్ఛతా కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



రైల్వేస్టేషన్ వద్ద స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ యూత్ అధికారి రమావత్‌సైదా, పీయూ అధికారులు

- పలు ప్రాంతాల్లో చెత్తను ఏరివేత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు జిల్లా కేంద్రంలో స్వచ్ఛతా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు రైల్వేస్టేషన్, బస్టాండ్, నవోదయ ఆస్పత్రి, డీఈఓ కార్యాలయం, ఎర్రసత్యం చౌరస్తా తదితర ప్రాంతాల్లో చెత్తా చెదారాన్ని ఏరివేశారు. ఈ సందర్భంగా యూత్ అధికారి హైదరాబాద్ రమావత్‌సైదా హాజరై ప్రసంగించారు. ప్రజల్లో స్వచ్ఛతా కార్యక్రమాల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వలంటీర్లు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వీధుల్లో, రోడ్ల వెంట వేయకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని, చెత్తను మున్సిపల్ సిబ్బందికి అందించడం వల్ల పరిశుభ్రమైన వాతావరణం పొందవచ్చన్నారు. స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి వలంటీర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, ప్రోగ్రాం అధికారులు రవికుమార్, అర్జున్‌కుమార్, గాలెన్న, రాఘవేందర్, ఈశ్వర్, చిన్నదేవి, ఇమ్మన్యుయేల్, శివకుమార్‌సింగ్ పాల్గొన్నారు.

రేపు 'ధిక్కార' పుస్తక పరిచయ సభ

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆధునిక సామాజిక వేత్త, సంస్కర్త మహాత్మా జ్యోతిరావుపూలే గురించి 156 మంది కవులు రాసిన కవితా సంకలనం 'ధిక్కార' పుస్తకాన్ని ఈనెల 14వ తేదీన ఆవిష్కరించనున్నట్లు పాలమూరు సాహితీ అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని లుంబిని ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు జరిగే పుస్తకావిష్కరణ సభకు ప్రముఖ విద్యావేత్త కవి లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు జూలూరి గౌరిశంకర్ పాల్గొంటారని, ప్రముఖ రచయిత, పీపీ బెక్కం జనార్దన్ గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ పుస్తకాన్ని సంపాదకులుగా వ్యవహరించిన ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య, పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని కవులు, రచయితలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

జీపీ లేఅవుట్లపై నిషేధం ఎత్తివేయాలి



మాట్లాడుతున్న బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అన్సార్ హుస్సేన్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామపంచాయతీ లే అవుట్లపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అన్సార్ హుస్సేన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్, మహబూబ్‌నగర్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం జీపీ లేఅవుట్స్‌పై విధించిన ఆంక్షలతో రియల్ ఎస్టేట్‌రంగం కుదేలయ్యిందన్నారు. దీంతో మధ్యతరగతి ప్రజలు, రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, చిన్న చిన్న రియల్టర్లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని వాపోయారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడం తగదన్నారు. రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువను పెంచాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే రియల్ ఎస్టేట్‌రంగం కుదేలు కాకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ రంగంపై చక్కటి అవగాహన ఉందని.. త్వరలోనే జీపీ లేఅవుట్స్‌పై నిషేధం ఎత్తివేస్తారనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. రేరా అందిస్తున్న ఐడీ కార్డులను ప్రతి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌కు ఉచితంగా అందించాలని కోరారు. మహబూబ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రజలకు అన్ని వసతులు కల్పించాలని అన్నారు. జడ్చర్ల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తొమ్మిది నెలలుగా సబ్ రిజిస్టర్ లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బాబు నాయక్, చందుయాదవ్ బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు శివాజీ, శివారెడ్డి, భాను ప్రతాప్, సురేందర్‌రావు, హైదర్ అలీ, శ్రీనివాస్, కిష్టారెడ్డి, రాము, శ్రీనివాస్, సురేందర్‌గౌడ్ , వెంకటేష్‌గౌడ్, రమేష్ ఉన్నారు.

సరదా కోసం రైలు ఎక్కిన చిన్నారులు

- కామారెడ్డిలో అమరావతి ఎక్స్‌ప్రెస్ ఎక్కగా.. షాద్‌నగర్‌లో గుర్తించిన ఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు
- చిన్నారులను కాపాడిన రైల్వే పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: గతంలో తండ్రితో పాటు చేసిన రైలు ప్రయాణం బాగా నచ్చడంతో ఇద్దరు చిన్నారులు ఇంట్లో చెప్పకుండా కామారెడ్డిలో రైలు ఎక్కారు. ఇంటి నుంచి తప్పిపోయిన చిన్నారులను మహబూబ్‌నగర్ రైల్వే ఆర్‌పీఎఫ్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. అందుకు సంబంధించి ఆర్‌పీఎఫ్ అధికారులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్‌కాలనీకి చెందిన ఉమర్(08), ఆసిఫ్(07) గురువారం ఉదయం ఇంట్లో వారికి చెప్పకుండా రైలు నంబర్ 12766 అమరావతి ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. షాద్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఎస్కార్టింగ్ చేస్తున్న ఇద్దరు ఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు అమరావతి ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-3లో ఆ ఇద్దరు చిన్నారులను సాయంత్రం 6.57 గంటల సమయంలో గుర్తించారు. పిల్లలను విచారించగా.. ఇంట్లో నుంచి పారిపోయినట్లుగా తెలుసుకున్నారు. ఈ విషయాన్ని పైఅధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ చిన్నారులను రాత్రి 7.57 గంటల సమయంలో మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో సురక్షితంగా దించుకొని ఆర్‌పీఎఫ్ పోస్టుకు తీసుకెళ్లారు. మొబైల్ ద్వారా చైల్డ్‌లైన్‌కు సమాచారం ఇచ్చారు. అనంతర ం మహబూబ్‌నగర్ ఎస్‌ఎస్ సమక్షంలో చైల్డ్‌హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ ఆర్.ఆంజనేయులకు చిన్నారులను అప్పగించారు. వారి నుంచి కామారెడ్డి పోలీసులు స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



వనపర్తి ఆస్పత్రిలో మాట్లాడుతున్న వైద్య అధికారులు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను శుక్రవారం రాష్ట్ర వైద్య అధికారుల బృందం పరిశీలించారు. శ్రీనివాస స్కానింగ్ సెంటర్, సుధానర్సింగ్ హోం, మౌనిక స్కానింగ్ సెంటర్, సృష్టి నర్సింగ్‌హోం స్కానింగ్ సెంటర్లను రాష్ట్ర వైద్య అధికారుల బృందం ప్రొఫెసర్ మహాత్మాగాంధీ మెటర్నిటీ హాస్పిటల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మాధవీలత, జిల్లా ఎగ్జిక్యూటివ్ వైద్య అధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. శ్రీనివాస స్కానింగ్ సెంటర్‌లో క్వాలిఫైడ్ స్టంట్లను వినియోగించాలని వారికి సూచించారు. సృష్టి ఆస్పత్రిలో స్కానింగ్ చేసే ప్రదేశంలో దేవుడి ఫొటోలు ఉండరాదని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆలే శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారి మంజుల, జిల్లా మాస్‌మీడియా అధికారి చంద్రయ్య, జిల్లా డేటా మేనేజర్ వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయంలో చోరీ జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. వీరభద్రస్వామి ఆలయంలోకి శుక్రవారం గుర్తుతెలియని దుండగులు చొరబడి 8 గ్రాముల బంగారం, రూ 2వేల నగదు అపహరించారు. విషయం తెలుసుకున్న సీసీఎస్ సీఐ టాటాబాబు, పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ ఆలయానికి చేరుకొని వివరాలు సేకరించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో సైతం గుర్తుతెలియని దుండగులు చొరబడి రెండు సీలింగ్ ఫ్యాన్లు చోరీ చేసినట్లు ఉపాధ్యాయుడు బాలకృష్ణ తెలిపారు. వరుస చోరీలతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.